ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్

చేవెళ్లలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. ఈ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరై ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీగా జనాలు తరలివచ్చారు. సభలో కేసీఆర్ మాటల తూటాలతో ఇటు ఓటర్లలో అటు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. కేసీఆర్ ప్రసంగం మధ్యలో ఈలలు, చప్పట్లు, కేరింతలు, జైతెలంగాణ.. జైజై తెలంగాణ అంటూ నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు బీజేపీ వైఫల్యాలను ఆయన ప్రజలకు వివరించారు.


బహిరంగ సభకు తరలివచ్చిన జనం

చేవెళ్ల మేధావుల్లారా..
ఆలోచించి ఓటెయ్యండి

- షాబాద్ ప్రాంతంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేశాం
- రంజిత్‌రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా..!
- రియల్ ఎస్టేట్ ఎందుకు పడిపోయింది?
- ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బీసీలకు దమ్మంటే కాసానిని గెలిపించండి

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల/మొయినాబాద్/షాబాద్ : చేవెళ్ల మేధావుల్లారా.. ఒక్కసారి ఆలోచించి ఓటేయ్యండని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కేసీఆర్ అన్నారు. కాసాని జడ్పీ ఛైర్మన్‌గా ఉమ్మడి జిల్లాకు సేవలందించారని, పాలనపై పట్టు, అనుభవం ఉన్న వ్యక్తి అన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకు వచ్చారని, బీసీలకు దమ్మంటే కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు బీసీలకు మలుపు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. షాబాద్ మండలం చందనవెల్లిలో వెల్పన్, కుందన్, కటేరా, అమేజాన్, సీతారాంపురంలో ఎలక్ట్రానిక్ బస్సులు, శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు వంటి పెద్దపెద్ద కంపెనీలను తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉద్దండాపూర్ నుంచి చేవెళ్ల వరకు సాగు, తాగునీటి పనులకు కొనసాగించామని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందని ఆయన ఆరోపించారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో బోరుబావుల కింద వరి పంట అధికంగా సాగు చేశారని, ధాన్యం అధికంగా వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో వేయడం జరిగిందని చెప్పారు. బీజేపీ సర్కార్ రంగారెడ్డి జిల్లాకు మెడికల్ కళాశాలలు, నవోదయ కళాశాలలు ఇవ్వకపోయినప్పటికి.. తమ ప్రభుత్వం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వేర్వేరుగా మెడికల్ కాలేజీలను ఇచ్చామని ఆయన గుర్తు చేశారు.

రంజిత్‌రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా..!

రంజిత్‌రెడ్డికి ఏం తక్కువ చేశాం.. ఎందుకు పార్టీ మారాల్సి వచ్చింది.. నేను చెబితేనే మీరు ఓట్లేసి గెలిపించారు.. ఆయనేమి పొద్దుతిరుగుడు పువ్వా..? అధికారం ఎక్కడ ఉంటే.. అక్కడ తిరగటానికి అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. రంజిత్‌రెడ్డి ఏ కారణం చేత కాంగ్రెస్‌లోకి వెళ్లాడు... అధికారం కోసమా? వ్యాపారం కోసమా అని ఆయన ప్రశ్నించారు. రంజిత్ రెడ్డికి చేవెళ్ల గడ్డ ప్రజలు దీటైన దెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వచ్చాక ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో భూములు ధరలు అమాంతంగా పెరిగాయని, లక్షల మందికి యువతకు ఉపాధి లభించిందని కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ సర్వనాశనం అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు సురభివాణీ దేవి, ఎగ్గె మల్లేశం, దయానంద గుప్తా, శంబీపూర్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్, రసమయి బాలకిషన్, టీఎస్ఐఐసీ మాజీ ఛైర్మన్ బాలమల్లు, డీసీఎంఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ నేతలు కాసాని వీరేష్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టెప్పులేసిన ఎమ్మెల్యే 'కాలె'

ప్రజాగాయకుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సభలో తన ఆట, పాటలతో సభికులను హోరెత్తించారు. 'గులాబీల జెండలమ్మ' అనే పాటకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్టెప్పులేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్ పార్టీ కండువాలను ఊపితూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.


సభకు వస్తున్న జనం

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగరవేస్తాం: సబితా ఇంద్రారెడ్డి



చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగరవేస్తామని మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత చేవెళ్ల ప్రజపైనే ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలంతా లోక్‌సభ ఎన్నికల్లో జోష్‌తో పనిచేయాలని సూచించారు.

ఒక్కసారి అవకాశమివ్వండి : ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్



ఉమ్మడి జిల్లా ప్రజలకు నేను ఎన్నో సేవలు అందించాను. ఉమ్మడి రాష్ట్రంలో 93 బీసీ కులాలలను ఏక తాటిపైకి తీసుకు వచ్చానని, తనకు ఎంపీగా ఒక్కసారి అవకాశమిచ్చి ఆశీర్వదించాలని అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ చెర్మన్‌గా, ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉందన్నారు.

రాష్ట్రానికి దశ దిశ చూపించిన నేత కేసీఆర్ : కాలె యాదయ్య



రాష్ట్రానికి దశదిశ చూపించిన నేత కేసీఆర్ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి రైతులు, పేదలు, అన్నివర్గాల ప్రజలకు చేయూతనిచ్చారని కొనియాడారు. చేవెళ్ల నియోజకర్గంలోని ఈసీ, మూసీ నదులపై 10 బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు అందించినట్లు చెప్పారు. 84 గ్రామాలకు గుదిబండగా ఉన్న జీవో 111 ఎత్తేయడం జరిగిందన్నారు.

ఉమ్మడి జిల్లాకు దరిద్రం వదిలింది : పైలట్ రోహిత్‌రెడ్డి



పట్నం కుటుంబం బీఆర్ఎస్ పార్టీ వీడటంతో ఉమ్మడి రంగారెడ్డికి దరిద్రం వదిలిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల సీటు ఆశపడ్డ వారికి మల్కాజిగిరి సీటు దక్కిందని, అక్కడ నుంచి అటే ఇంటికే పోతారని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థి కొండా'ను గెలిపిస్తే.. చిక్కడు దొరకడని, ఆయనే ఎవరినే గుర్తుపట్టడని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి వెళ్లిన వాళ్లే ఇటు కాంగ్రెస్ అటు బీజేపీలకు అభ్యర్థులుగా ఉన్నారని, ఒక్క లీడర్ పోతే వంద మంది లీడర్లను తయారు చేసే సత్తా కేసీఆర్‌కు ఉందన్నారు. శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, చేవెళ్ల మాజీఎంపీపీ బాల్‌రాజ్, జడ్పీటీసీలు అవినాష్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెరిగిన కందుల ధరలు

ధారూరు, ఏప్రిల్ 13: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల ధరలు పెరిగాయి. శనివారం సాయత్రం కంది, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కందులు క్వింటాలుకు రూ.11,400 నుంచి 11,540 వరకు ధర పలికింది. ఈ వారం కంది ధర క్వింటాలుకు రూ.1200పైగా పెరిగింది. మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2220నుంచి 2250 వరకు ధర పలికింది. కందులు 10క్వింటాళ్లు, మొక్కజొన్న 45క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయి.

124మి.మీ వర్షపాతం

- జిల్లాలో పలు చోట్ల అకాల వర్షం
- ఉక్కపోత నుంచి జనానికి ఉపశమనం

వికారాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షానికి 124 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగాబషీరాబాద్ మండలంలో 47.2మి.మీ. వర్షం కురియగా, మర్పల్లి మండలంలో 12.6మి.మీ, పూడూరులో 13.2మి.మీ., ధారూరులో 10.2మి.మీ, తాండూరులో 8.4మి.మీ., మోమిన్‌పేట్‌లో7.0 మి.మీ, పరిగిలో 5.0మి.మీ., వికారాబాద్‌లో 4.8 మి.మీ., యాలాల్‌లో 4.8 మి.మీ., నవాబ్‌పేట్‌లో 3.8మి.మీ, కొడంగల్‌లో 3.4మి.మీ, పెద్దేముల్‌లో 2.2మి.మీ. వర్షపాతం నమోదైంది. బొంరాస్‌పేట్‌లో1.0మి.మీ., దోమలో0.6 మి.మీ, కులకచర్లలో 0.4మి.మీ, కోట్‌పల్లిలో 0.2మి.మీ., వర్షం కురియగా, బంట్వారం, దౌల్తాబాద్, చౌడాపూర్ మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

ధారూరులో కురిసిన వర్షం

ధారూరు: ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు శుక్రవారం రాత్రి కురిసిన వర్షం ఉపశమనమిచ్చింది. ఉరుములు, మెరుపులతో గంట పాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో శనివారం వాతావరణం చల్లబడి చల్లని గాలులు వీచాయి. వర్షం వేసవి దుక్కులు దున్నటానికి ఉపకరిస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

వివాదాలను పరిష్కరించిన
వివాద పరిష్కార సంస్థ


- డబ్ల్యూటీవో మాజీ ఛైర్మన్, అప్పీలేట్ బాడీ సభ్యుడు ఉజల్ సింఘ్ భాటియా


మాట్లాడుతున్న ఉజల్ సింఘ్ భాటియా

శామీర్‌పేట, ఏప్రిల్ 13 : గడిచిన కాలంలో వివాద పరిష్కార సంస్థ అనేక వివాదాలను పరిష్కరించిందని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) మాజీ ఛైర్మన్, అప్పీలేట్ బాడీ సభ్యుడు ఉజల్ సింఘ్ భాటియా అన్నారు. శనివారం శామీర్ పేటలోని నల్సార్ యూనివర్సిటీలో నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ బిజినెస్ లాస్, సెంటర్ ఫర్ డబ్ల్యూటీవో స్టడీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) సహకారంతో వివాద పరిష్కార వ్యవస్థకు సంక్షోభాలు, పరిష్కారాలు అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. తొలిరోజు జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ బిజినెస్ లా డైరెక్టర్ పీఎస్ రావు సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. డబ్ల్యూటీవో స్టడీస్ సెంటర్ హెచ్ ప్రొఫెసర్ ప్రీతమ్ బెనర్జీ, డబ్ల్యూటీవో బాడీ సెక్రటేరియల్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వెర్నర్ బౌచ్‌లు మాట్లాడుతూ వివాద పరిష్కార సంస్థను పునరుద్ధరించటంలో భారతదేశం చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రెండురోజుల సదస్సులో తొమ్మిది టెక్నికల్ సెషన్లు, రెండు ప్లీనరీ సెషన్లు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రార్‌ప్రొఫెసర్ విద్యుల్లతారెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డబ్ల్యూటీవో స్టడీస్ ప్రొఫెసర్ జేమ్స్, ప్రపంచ పీటర్ వాన్ డెన్ బాచ్, సెక్రటరీ అతుల్ కౌశిక్, షీలారాయ్, ప్రొఫెసర్లు శైలజాసింగ్, ఆర్‌పీ అనురాధ, న్యాయ నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

చేరికలపై అసంతృప్తి

- వద్దంటూనే.. కాంగ్రెస్‌లోకి రమ్మంటున్న పార్టీ పెద్దలు
- అధిష్ఠానం ఏకపక్ష నిర్ణయాలు.. స్థానిక నాయకుల ఆగ్రహం
- కొత్తవారి చేరికతో పార్టీకి ప్రయోజనం శూన్యమంటున్న పార్టీ శ్రేణులు



మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 13: పార్టీలో కొత్తగా చేరుతున్న నేతలతో కాంగ్రెస్ పార్టీ స్థానిక నేతల్లో ధిక్కార స్వరం మొదలైంది. పార్టీలో కొత్తవారిని చేర్చుకునే విషయంలో అధిష్ఠానం ఒంటెద్దు పోకడలపై సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా మేడ్చల్‌లో కొనసాగుతున్న చేరికల వ్యవహారంపై చాలామంది స్థానిక కాంగ్రెస్ నేతలు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. పదేళ్లుగా ఎవరితో పోరాడామో.. ప్రస్తుతం వారినే కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్న వాదనలూ వినబడుతున్నాయి. అధికారదాహంతో చాలామంది తమ పార్టీలో వద్దన్నా రావటానికి సిద్ధంగా ఉన్నారని, ఇలాంటి పరిస్థితిలో పార్టీలో ఎవరిని చేర్చుకోవాలి? ఎవరిని చేర్చుకోవద్దన్న విషయంలో స్థానిక నేతలకు, కాంగ్రెస్ పెద్దలకు మధ్య సయోధ్య కొరవడిందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం స్థానిక నేతల అభిప్రాయాలను తుంగలో తొక్కి... ఎవరినిబడితే వారిని పార్టీలో చేర్చుకుంటున్నారని కొందరు నేతలు మండిపడుతున్నారు. రెండు నెలలుగా మేడ్చల్‌కు చెందిన చాలా మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. వీరిలో కొందరిని తప్పా.. చాలామందిని స్థానిక కాంగ్రెస్ నేతలు ముక్తకంఠంతో అధిష్ఠానం ఎదుట వ్యతిరేకించారు. అయినప్పటికీ పార్టీ పెద్దల నిర్ణయాలకు తలవంచాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు కాంగ్రెస్ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. పార్టీలో చేరుతున్న వారితో పార్టీకి ప్రయోజనం ఎంతవరకు చేకూరుతుందన్న విషయం పట్ల స్పష్టత లేకుండా.. పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయని పార్టీ సీనియర్లు గగ్గోలు పెడుతున్నారు.

మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ల చేరికతో మరింత నిరాశ!

మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరటంపై ఆ పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో చేరిన వారిలో ఇద్దరు, ముగ్గురు తప్పా మిగతా వారికి ప్రజాదరణ లేదని స్థానిక నేతలు పార్టీ అధిష్ఠానం ఎదుట ప్రస్తావించినా.. పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం బీఆర్ఎస్‌ను ఖాళీ చేయాలన్న సంకల్పంతో పార్టీలో చేర్చుకుంటున్నారే తప్పా.. నేతలకు ప్రజల్లో ఉన్న ఆదరణ గురించి పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఇప్పటికే ఈ విషయం పట్ల పలుమార్లు సీనియర్లతో చర్చించినా వినిపించుకోవడం లేదని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో సీనియర్లు!

పార్టీలో చేరికల వ్యవహారంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా స్థానిక నేతలను సముదాయించలేక పార్టీ సీనియర్లు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గట్టెక్కటానికి కొత్తవారిని పార్టీలో చేర్చుకోవాలని కొందరు సీనియర్లు బల్లగుద్దినట్టు స్థానిక నేతలకు వివరిస్తున్నప్పటికీ.. వారు ససేమిరా అంటున్నారు. ప్రధానంగా మేడ్చల్, మున్సిపాలిటీలకు చెందిన ఛైర్‌పర్సన్‌తో పాటు మండలంలోని సీనియర్ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ కండువాను కప్పుకోవటానికి ఉత్సాహం చూపుతున్నారు. అయితే, స్థానిక నేతలు వారి చేరికలను వ్యతిరేకిస్తున్నందున.. బీఆర్ఎస్ నేతలు నేరుగా కాంగ్రెస్ పెద్దలను కలిసి పార్టీలో చేరటానికి సిద్ధంగా ఉన్నట్లు తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. దీంతో పార్టీ పెద్దలు స్థానిక నేతలను కాదనలేక బీఆర్ఎస్ నేతల చేరికలను దాటవేస్తున్నారు. ఇదిలా ఉండగా, లోక్‌సభ ఎన్నికల వాతావరణం వేడెక్కడంతో చాలామంది నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీకి చెక్ పెట్టేందుకు స్థానికనేతలను పక్కనబెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నట్లు సీనియర్లు చెబుతున్నారు.

త్వరలో పార్టీ మారనున్న మేడ్చల్ ఛైర్‌పర్సన్ దీపిక?

మేడ్చల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపిక కూడా త్వరలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది. దీపిక, ఆమె భర్త నర్సింహారెడ్డిలతో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు పార్టీలోకి వస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్లు పరోక్షంగా సంకేతాలు పంపుతున్నారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నేతలతో పాటు ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లలో టెన్షన్ మొదలైంది. పార్టీలో కొత్తవారిని చేర్చుకునే విషయంలో కీలక నిర్ణయాలు తీసుకునే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌ల వ్యవహారంపై కిందిస్థాయి నేతలు అసంతృప్తిగా ఉన్నారు. స్థానికనేతల అభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీలో చేర్చుకుంటే.. తాము రాజకీయాలకు దూరంగా ఉంటామని కొందరు సీనియర్లు బహిరంగంగానే చెబుతున్నారు. అదేవిధంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఆమె భర్తను పార్టీలోకి ఆహ్వానించడంపై కొందరు మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- కొడంగల్ ప్రాంతంలోని 38 గ్రామాల తాగునీటి పథకం పరిశీలన
- పంచాయతీరాజ్.గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా


పరిగి: రాఘవాపూర్‌లో మిషన్‌భగీరథ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్

పరిగి,ఏప్రిల్ 13: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ సత్వరమే చర్యలు తీసుకోవాలని పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. పరిగి మండలం రాఘవాపూర్‌లోని 13.5 ఎంఎల్‌డీ కేపాసిటీ గల మిషన్‌భగీరథ నీటిశుద్ధి ప్లాంట్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మిషన్‌భగీరథ అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. వాటర్ గ్రిడ్‌లో వివిధ విభాగాలను పరిశీలించారు. గ్రిడ్ కేపాసీటి, సరఫరాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడంలో అనుకోకుండా ఇబ్బందులు కలిగినప్పుడు ప్రత్యామ్నాయంగా తాగునీటిని అందించేందుకు వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బోరువెల్స్, చేతిపంపులను మరమ్మతులు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగాఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.100 కోట్లతో 19,605 చేతిపంపులు, 14,708 సింగిల్‌ఫెస్, ఐదు హెచ్‌పీ పంపుసెట్లు, 605 మంచినీటి బావులు పని చేస్తున్నాయని తెలిపారు. 662 కి.మీటర్ల ఇంట్రా పైపులైన్ మరమ్మతులు స్పెషల్ డ్రైవ్ కింద చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాకు రూ.3.54 కోట్ల నిధులు మంజూరీ చేశామని, ఈ నిధులతో 1,044 పంపుసెట్లు, 495 చేతిపంపులు మరమ్మతులు చేయించామని తెలిపారు. రాష్ట్రంలో 23,975 గ్రామాలకు 37,002 ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తున్నామని చెప్పారు.

కాగ్నా నుంచి తాగునీటి సరఫరాకు ట్రయల్ రన్

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని గతంలో 38 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే కాగ్నా పథకాన్ని శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు పరిశీలన చేశారు. 20 ఏళ్ల క్రితం తాండూర్ శివారులోని కాగ్నా వాగు దగ్గర ప్రారంభించిన తాగునీటి పథకం కొన్నేళ్లుగా నిలిచిపోయింది. దీనిని ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు. మిషన్ భగీరథ తాగునీటి కోసం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి సరఫరా అవుతుండగా వేసవిలో సమస్య ఉత్పన్నం అయితే తిరిగి కాగ్నాపథకం నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా శనివారం ఓ మోటార్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించి తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రస్తుతం కాగ్నా పథకం పునరుద్ధరణతో మిషన్‌భగీరథ పథకం పైపులైన్‌ల ద్వారా ఆయా గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగ్నా పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని సిద్ద నొంపు సమీపంలోని సంపుహౌస్ ద్వారా వివిధ గ్రామాలకు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు సమష్టిగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ తెలిపారు. కాగ్నా నుంచి 2.5 యం.ఎల్.డీ తాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి స్వచ్ఛతను తెలుసుకునేందుకు వీలుగా ప్రతీ గ్రామ పంచాయతీకి ఫ్లోర్ కో కిట్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీరు చెన్నారెడ్డి, ఎస్ఈ ఆంజనేయులు, ఈఈలు బాబు శ్రీనివాస్, చల్మారెడ్డి, వెంకరమణ, డీపీవో జయసుధ, డీఆర్‌డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.


కాగ్నా నుంచి తాగునీటిని సరఫరా చేసే పంప్‌హౌస్

నేడు బషీరాబాద్‌లో అయ్యప్ప మహా పడిపూజ

బషీరాబాద్, ఏప్రిల్ 13: మండల కేంద్రమైన బషీరాబాద్‌లో ఆదివారం (నేడు) అయ్యప్ప స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని మహాపడి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సాయిలుగౌడ్, పవన్ ఠాగూర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మహాపడి పూజ ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులందరు హజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శామీర్‌పేట అభివృద్ధికి తోడ్పాటునందించాలి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ముజీబుద్దీన్

శామీర్‌పేట, ఏప్రిల్ 13: మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ముజీబుద్దీన్ సీఎంను కోరాడు. ముజీబుద్దీన్ హైదారాబాద్ నగరంలోని క్యాంప్ కార్యాలయానికి శనివారం వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శామీర్‌పేట మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చాలని ముజీబుద్దీన్ సీఎంను కోరారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి : స్పీకర్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 13: నిత్యం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు రంజిత్‌రెడ్డిని గెలిపించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండల బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధిని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. 30 రోజులు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పది సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌గౌడ్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

కందుకూరు : చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి ఎల్మటి అమరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ఎంతో దోహదపడుతుందన్నారు. పీసీసీ కమిటీ సభ్యులు ఎస్. మల్లేష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, నియోజకవర్గం అధ్యక్షుడు ఎండీ అహ్మద్‌బాయ్, తదితరులున్నారు.

బీజేపీని ఓడించాలి : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్ : రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. మండలంలోని కందనెల్లి సమీపంలో గల జీపీఆర్ గార్డెన్‌లో శనివారం తాండూరు నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

పేదల కడుపు నింపేది కాంగ్రెస్సే : రంజిత్‌రెడ్డి

పేదల కడుపు నింపేది కాంగ్రెస్ పార్టీయేనని, మతం పేరుతో రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేది బీజేపీ అని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. తాను పిలిస్తే పలికే వ్యక్తినని, తనను కలవడానికి ఎవరూ అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని, తనకు విశ్వేశ్వర్‌రెడ్డితోనే పోటీ అని, ఆయన్ను కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, అది తీసుకున్నా.. సమయానికి వెళ్లకపోతే.. వారినికూడా కలవరన్నారు. కేవలం స్టేటస్ కోసమే ఎంపీగా గెలవాలని కోరుకుంటున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, మునిసిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సొసైటీ చైర్మన్ రవిగౌడ్, నారాయణరెడ్డి, సునీతసంపత్, మండలాధ్యక్షులు గోపాల్, నర్సిములు, రియాజ్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.


మోమిన్‌పేట : మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

వికారాబాద్ : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యపడుతుందని రంజిత్‌రెడ్డి అన్నారు. నవాబుపేట మండలం కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి మండలాధ్యక్షుడు వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, బీబ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకురాలు ప్రభావతి, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హైదర్‌నగర్/చందానగర్ : ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. విష్ణు, వంశీగౌడ్ పార్టీలో చేరారు. రామకృష్ణగౌడ్ తదితరులున్నారు. అదేవిధంగా రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు, హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత, టూరిజం డెవలప్‌మెంట్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ చందానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నేడు పరిగిలో భారీ ర్యాలీ

పరిగి : రంజిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగి నియోజకవర్గంలో నేడు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండలాధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణాధ్యక్షుడు కృష్ణ తెలిపారు. పరిగిలో విలేకరులతో మాట్లాడుతూ పూడూరు మండలం రాకంచర్ల నుంచి పరిగి వరకు ర్యాలీ ఉంటుందని, పరిగిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తారని తెలిపారు.


పెద్దేముల్ : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


మాజీ ఎంపీపీ స్వప్న, ఆమె భర్త, కౌన్సిలర్ వెంకట్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కీసర రూరల్, ఏప్రిల్ 13: నాగారం మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో నాగారం మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ స్వప్న, కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్, అన్నంరాజ్ సుమిత్ర, కో-ఆప్షన్‌సభ్యుడు ఆదం షఫీ, సింగిల్‌విండో డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, దమ్మాయిగూడ మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరిగౌడ్ దంపతులు పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు. వీరంతా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే కావటంతో ఆ పార్టీకి భారీ గండి పడింది. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరింత మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఇటీవలే బీజేపీలో చేరగా, పాలకవర్గానికి చెందిన వారు ఇతర పార్టీల్లో చేరుతుండటంతో నాగారంలో బీఆర్ఎస్ పార్టీ బలహీనంగా మారుతోంది. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పంగ హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల్ల కుమార్, నాయకులు పొట్ట శ్రీశైలం, సతీష్ గౌడ్, కొండల్‌రెడ్డి, సత్యంసాగర్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ

కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీలు

మేడ్చల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సమన్వయ కమిటీలను నియమించినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కమిటీలు మే 13న లోకసభ ఎన్నికలు ముగిసేంత వరకు పనిచేస్తాయన్నారు. మేడ్చల్ కమిటీలో వజ్రేష్‌యాదవ్, శరత్‌చంద్రారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మహ్మద్ ముజీబుద్దీన్, పి.అమరేందర్‌రెడ్డి, పి.హరిబాబు, ఉప్పల్‌కు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజశివమణి, రజితారెడ్డి, బి.శ్రీదేవి, జలీల్‌పాషా, గడ్డం యాదగిరి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంకు మైనంపల్లి హన్మంతరావు, రాజ జితేంద్రనాథ్, ఎన్.అశోక్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, టి.లక్ష్మీకాంత్‌రెడ్డి, కంటోన్మెంట్‌కు వెన్నెల, అమరేందర్‌రెడ్డి, రాజు, యాదగిరి, బాబురావు, వెంకటేశ్, కూకట్‌పల్లికి బండి రమేష్, సత్యం శ్రీరంగం, పి.నాగిరెడ్డి, టి.వేణు, పి.విఠల్‌రెడ్డి, పుష్పరెడ్డి, సంధ్యారాణి, రాజేందర్, బషీర్‌భాయ్‌లతో సమన్వయ కమిటీలను నియమించినట్లు పేర్కొన్నారు.

రూ.లక్షా 50వేల నగదు స్వాధీనం

దౌల్తాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఈక్రమంలో వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటకలోని యాద్గీర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కేఏ 33 యం 9931 నెంబరు గల కారును తనిఖీ చేయగా రూ.లక్షా 50వేలు పట్టుబడ్డాయి. దాంతో డబ్బును సీజ్ చేసినట్లు దౌల్తాబాద్ ఎస్సై శ్రీశైలం యాదవ్ తెలిపారు.


నగదును చూపిస్తున్న ఎస్సై శ్రీశైలం

విరాసత్ కోసం ఆరు నెలలుగా నిరీక్షణ

- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతు
- రెండుసార్లు మీ-సేవలో విరాసత్‌కు దరఖాస్తు
- రెవెన్యూ అధికారులపై అవినీతి ఆరోపణలు!
- కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 13: రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి ఓ రైతు అలిసిపోయాడు. ఆరు నెలల క్రితం విరాసత్ కోసం దరఖాస్తు చేసినప్పటికీ పెండింగ్‌లో ఉంది. దాంతో ఆ రైతు ప్రతీరోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన పెంటగుంతల చంద్రప్పకు తన తండ్రి పెంటప్ప పేరున ఉన్న 6ఎకరాల 4గుంటల భూమి ఉంది. పెంటప్పకు ముగ్గురు కుమారులు. ఇందులో ఇద్దరు మృతిచెందారు. అయితే, కుమారులు చనిపోవడంతో ఒక కుమారుడు, ఇద్దరు కోడళ్ల పేరుమీద భూమి వారసత్వంగా పట్టా చేయాల్సి ఉంది. ఇందుకోసం చంద్రప్ప 2023 అక్టోబర్ 13న రూ.16వేలు మీ-సేవలో చెల్లించి విరాసత్‌కు తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దాంతో మళ్లీ అక్టోబర్ 23న మరో రూ.16వేలు చెల్లించినా ఫలితం లేకపోయిందని రైతు చంద్రప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. అన్నిరకాల సర్టిఫికెట్లు ఉండి ఆరునెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా విరాసత్ కావడం లేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని రైతు వేడుకుంటున్నాడు.


విరాసత్ పేపర్లు చూపిస్తున్న రైతు పెంటగుంతల చంద్రప్ప

అధికారులపై అవినీతి అక్రమాల ఆరోపణలు

తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల ధరణిలో అధికారులు అవినీతి ఆరోపణల మూలంగానే వారిని బాధ్యతల నుంచి తప్పించి రిజిస్ట్రేషన్ అథారిటీని తహసీల్దార్ తారాసింగ్‌కు అప్పగించినట్లు తెలిసింది. ధరణి ఆపరేటర్‌ను సైతం మార్చినట్లు సమాచారం. రెవెన్యూ జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపితే తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి బండారం బయటపడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కలెక్టర్ రెవెన్యూ అధికారులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నది వాస్తవమే

బిజ్వార్‌కు చెందిన రైతు చంద్రప్ప విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్న విషయం వాస్తవమే. క్షేత్రస్థాయిలో వెళ్లి పంచనామా పూర్తి చేశాం. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తి నివేదికను పంపిస్తాం. ప్రతీ రైతుకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తాం. చంద్రప్ప సమస్య తెలుసుకొని అతడికి అన్నివిధాలా న్యాయం చేస్తాం.

- బాల్‌రాజ్, తాండూరు ఆర్ఐ

బీజేపీది మత రాజకీయం


ఆమనగల్లులో మాట్లాడుతున్న మల్లు రవి

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి ఏప్రిల్ 13 : అధికారాన్ని కాపాడుకోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు సాగిస్తూ దేశంలో విద్వేషాలను రెచ్చగొడుతోందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. పదేళ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు మేలు జరిగిందే తప్పా.. పేదలకు ఒరగబడిందేమీ లేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో రోడ్ షో నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన రోడ్ షోలో మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సతీష్ మాదిగ, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, లోక్‌సభ ఎన్నికల కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఇందిరా శోభన్‌లు పాల్గొన్నారు. ర్యాలీలు, రోడ్ షోలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మల్లు రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టాలు తప్పిందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి సమాధి తప్పదన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ స్కామ్‌లు, స్కీంల పేరుతో దేశాన్ని లూటీ చేశారని, ఓటుద్వారా ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. కసిరెడ్డి మాట్లాడుతూ మల్లు రవికి కల్వకుర్తి నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ ఇచ్చేలా పార్టీ శ్రేణులంతా సైనికుల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు కమ్లీమోత్యానాయక్, అనితా విజయ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బీక్యానాయక్, అంజయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్, భగవాన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులకు ఎన్నికల కోడ్ వర్తించదా?

కులకచర్ల, ఏప్రిల్ 13: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలకు ఎన్నికల కోడ్ వర్తించదా? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరపరాదని సంబంధిత అధికారులు దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బెల్టు షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులకు కనిపించడం లేదా? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం కులకచర్లలో వైన్ దుకాణాలు రాత్రి 10గంటల వరకు మూతపడుతున్నా బెల్టుషాపులు మాత్రం అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. రోడ్డు పక్కన దుకాణాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగించడంతో ఆ దారిలో వెళ్లేందుకు వాహనదారులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. మూడు రోజుల కిందట ప్రత్యేక బృందాలు కులకచర్లలో బెల్టుషాపులపై దాడిచేశారు. మద్యం లభించినా ఏ చర్యలు తీసుకోకుండా వదిలిపెట్టడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో బెల్టు షాపులపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహిస్తూ నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో కొందరు బెల్టు షాపుల నిర్వాహకులు దర్జాగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు బహిరంగంగా మద్యం విక్రయాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బెల్టుషాపులపై నామమాత్రపు దాడులు చేసి నిర్వాహకులను వదిలిపెట్టడం సరైన పద్ధతికాదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు : డీఎస్పీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్/కొడంగల్, ఏప్రిల్ 13: నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు శనివారం డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను వికారాబాద్‌లో ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వారంరోజుల పాటు ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అధికారి వెంకట రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ కొడంగల్ అధికారి ప్రభాకర్ కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి చేతులమీదుగా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిబ్బంది మతీన్, ఆనంద్, భీమ్‌రెడ్డి, మోతిలాల్, భానుప్రసాద్, వెంకటప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


కందుకూరు : నేదునూరులో మాట్లాడుతున్న కొండా

కందుకూరు, ఏప్రిల్ 13 : ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగి పోయారని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్ర శనివారం ఉదయం మండలంలోని చిప్పలపల్లి, ధన్నారం, పులిమామిడి, బాచుపల్లి, నేదునూరు, దాసర్లపల్లి, ముచ్చర్ల, ఊట్లపల్లి, సార్లరావులపల్లి, మీర్కాన్‌పేట, ఆకులమైలారం గ్రామామీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా గుమ్మడవెల్లిలో బహిరంగ సభ నిర్వహించారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల రాష్ట్రంగా మార్చాయన్నారు. కేంద్రం అమలు చేసిన ఫసల్‌బీమా, ఆవాజ్ యోజన వంటి పథకాలను రాష్ట్రంలో అమలు కాకుండా బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కాగా, 24 రోజులపాటు కొనసాగిన ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా 13 కిలోమీటర్ల మేర తిరిగి.. 380 గ్రామాలను పర్యటించి రైతులు, ప్రజలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించినట్లు కొండా తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకున్నా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.9వేల కోట్ల నిధులను మంజూరు చేసినట్లు విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే ఈ ఎన్నికల్లో తన విజయానికి శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, యాత్ర ఇన్‌చార్జి ఎస్.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములయాదవ్, పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, పార్టీ మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, మహేందర్, ఎంపీటీసీ మల్లేష్, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, గౌర ప్రభాకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొండా గెలుపునకు కృషి

రాజేంద్రనగర్ : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి కార్యకర్తలు సైనికుల వలే పనిచేస్తున్నామని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి నవారు మురళీధర్‌రెడ్డి అన్నారు. నాయకులు రామిడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరంలో విశ్వేశ్వర్‌రెడ్డికి పార్టీ ఎల్ఈడీ గుర్తును బహూకరించారు. మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబం ముద్ర బలంగా ఉందన్నారు. నిజాయితీగల నాయకునిగా కొండాకు పేరుందన్నారు. చేవెళ్ల నుంచి విశ్వేశ్వర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికె జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సేవచేసే నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదర్‌నగర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే నాయకుడు కొండా విశ్వేశ్వరరెడ్డి అని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. హైదర్‌నగర్ భాగ్యనగర్, హెచ్‌ఎంటీ శాతవాహన, హెచ్‌ఎంటీహిల్స్, నాగార్జునహోమ్స్, నిజాంపేటరోడ్, అల్లాపూర్ సొసైటీ కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


హైదర్‌గూడ : ఇంటింటి ప్రచారంలో రవికుమార్

నాణ్యమైన సేవలందించాలి

● హెచ్‌పీసీఎల్ సంస్థ డీజీఎం రఘుపతి



మాట్లాడుతున్న డీజీఎం రఘుపతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13: హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సంస్థ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆ సంస్థ డీజీఎం టి.రఘుపతి అన్నారు. మండలంలోని అంకుషాపూర్‌లోని హెచ్‌పీసీఎల్ 50వ వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అనాథ పిల్లలకు భోజనం, పండ్లు పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్ సంస్థ సీఎస్ఆర్ (కమ్యునిటీ సోషల్ రెస్పాన్సబుల్) కింద నిధులు కేటాయించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

జీవిత బీమా చెక్కు అందజేత



అంజమ్మకు చెక్కు అందజేస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని ఐనన్‌పల్లికి చెందిన మాలమీది భీమయ్య మూడు నెలల కిందట గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్‌లో జీవిత బీమా పాలసీ ఉండటంతో శనివారం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్, డీజీఎం నరేందర్, ఆర్ఎం శ్రీనివాస్, వికారాబాద్ జిల్లా ఏరియా మేనేజర్ సత్యనారాయణ, సంజీవ్, రాంచందర్, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు గ్రామానికి చేరుకొని నామిని మాలమీది అంజమ్మకు రూ.7,46,799 జీవిత బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ అధికారులు మమత, రాజు, వెంకటేష్, బస్వరాజ్, పకీరప్ప, నర్సమ్మ, షైపాల్, రాములు, అంజిలయ్య, నరేందర్, కనకప్ప, పకీరప్ప, లక్ష్మీ, దేవమోని రోజమణి, తాండూర్ బ్రాంచీ ఏరియా మేనేజర్ కృష్ణమాచారి, శ్రీనివాస్‌రెడ్డి, భీంశంకర్, శివకుమార్, సురేశ్ పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



క్రికెట్ కిట్ అందజేస్తున్న మారుతీకిరణ్

పరిగి. ఏప్రిల్ 13: యువత అన్నిరంగాల్లో రాణించాలని బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతీకిరణ్ అన్నారు. పరిగి పట్టణంలోని మూడవవార్డులోని యువతకు క్రికెట్ కిట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధానకార్యదర్శి వార్ల ఆంజనేయులు, నాయకులు రవిగౌడ్, మహేశ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు



రూఫ్‌ఖాన్‌పేట్ పాఠశాలను సందర్శించిన ఎంఈవో

పరిగి. ఏప్రిల్ 13: ఈనెల 15 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరిగి ఎంఈవో హరిశ్చందర్ తెలిపారు. పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను శనివారం మండలంలోని ఆయా పాఠశాలకు పంపించారు. ఈ సందర్భంగా ఎంఈవో మండలంలోని రూఫ్‌ఖాన్‌పేట్, రంగంపల్లి తదితర గ్రామాల పాఠశాలను శనివారం సందర్శించారు.

నేడు రక్తమైసమ్మ ఉత్సవాలు

తాండూరు, ఏప్రిల్ 13: ప్రభుత్వ నెంబర్ వన్ ఉన్నత పాఠశాల సమీపంలో కొలువైన రక్త మైసమ్మ దేవాలయ ఉత్సవాలు ఆదివారం(నేడు) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం బోనాల కార్యక్రమం, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఆలయాన్ని ఉత్సాల సందర్భంగా ముస్తాబు చేశారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



తాండూరు: జెండా ఊపి సభకు బయల్దేరుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



పరిగి: బీఆర్ఎస్ జెండా ఊపి సభకు బయల్దేరుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 13: తాండూరు నుంచి బీఆర్ఎస్ తాండూరు నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. వాహనాల్లో తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అనురాధ, నరేందర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని కోటబాస్పల్లి, సిరిగిరిపేట్, కరన్‌కోట్, చెనిగేష్‌పూర్, అంతారం, ఓగీపూర్, బెల్కటూర్, చంద్రవంచ, మల్కాపూర్, గోనూరు తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, మండల బీఆర్ ఎస్ అధ్యక్షుడు సిరిగిరిపేట్ వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేవెళ్ల ప్రజాఆశీర్వాద సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉమాశంకర్, మాజీ సర్పంచ్‌లు రాజప్పగౌడ్, ఎత్తరి రాములు, గోవింద్, ప్రకాష్, ఎంపీటీసీ శాంత్‌కుమార్ ఉన్నారు.

యాలాల: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపొందడం ఖాయమని యాలాల మండల టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సమావేశానికి శనివారం యాలాల మండలం నుండి భారీఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. యాలాల మండల కేంద్రం నుండి టిఆర్ఎస్ నాయకులు బస్వరాజ్ , పాండు గౌడ్, యాదప్ప, నర్సింహులు వెళ్లారు.

బషీరాబాద్: బషీరాబాద్ మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల వైస్ ఎంపీపీ అన్నపూర్ణ అనంతయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేవెళ్లకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇందర్‌చేడ్ రాజు ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీ నేతలు, ప్రజాప్రతినిధులు ఈ సభకు తరలివెళ్లారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేవెళ్లకు బయలు దేరివెళ్లారు.

పరిగి: చేవెళ్లలో శనివారం నిర్వహించిన మాజీ సీఎంకేసీఆర్ ఎన్నికల ప్రజాఆశీర్వాద సభకు పరిగి నుంచి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. పరిగి నియోజవకవర్గంలోని ఆయా మండలాల నుంచి వాహనాల్లో పరిగికి చేరుకున్నారు. పరిగిలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం చేవెళ్లలో జరిగిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు తరలివెళ్లారు. కులకచర్ల, బండ వెల్కిచర్ల, పుట్టపహాడ్, మదిపాల్, మరికల్ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, కృష్ణయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, మేగ్యనాయక్, శ్రీశైలం, బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు చేవెళ్లకు వెళ్లారు.

పూడూరు: మండలంలోని మేడిపల్లి కాలన్ గ్రామం నుంచి బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభకు ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు యాసిన్, గోపాల్‌రెడ్డి, నర్సింహులు, వెంకట్, రవి, సాయిలు, కిష్టయ్య, అంబేద్కర్, బాబర్, వెంకట్‌రెడ్డి తరలివెళ్లారు.

దోమ: చేవెళ్లలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వదసభకు దోమ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.



కొడంగల్: చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభకు బయల్దేరి వెళ్తున్న అప్రమాదికుర్దు నాయకులు, కార్యకర్తలు

కనుల పండువగా పెద్దమ్మతల్లి కల్యాణం



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శామీర్‌పేట, ఏప్రిల్ 13: తూంకుంట మున్సిపల్ ఉప్పరిపల్లి పరిధిలోని శ్రీపెద్దమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పెద్దమ్మతల్లి, పెద్దరాజుల కల్యాణం భక్తుల కోలహలం మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టగా భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి అమ్మవారి కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, వివిధపార్టీల నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపాలిటీ మైనార్టీ కమిటీ నియామకం



ఎమ్మెల్యే మల్లారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేడ్చల్ మైనార్టీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ మైనార్టీ సెల్ నూతన కమిటీని శనివారం నియమించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మైనార్టీ అధ్యక్షుడు ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎండీ.ఆబేద్, ప్రధాన కార్యదర్శిగా షేక్‌యాసూఫ్, ఉపాధ్యక్షుడిగా లాయక్ అలీ, ఎండీ. తాజ్, జుబేర్, జలీల్ ఖాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నాసేర్ ఖాన్, సాయింట్ సెక్రటరీగా ఆదిల్ ఖాన్, కోషాధికారిగా జావేద్ షరీఫ్, స్పోక్ పర్సన్‌గా ఖమురొద్దీన్‌ను నియమించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కౌఆప్షన్ సభ్యుడు మహెబూబ్ అలీ పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థుల ఎస్ఎంఎస్ ప్రచారం

తాండూరు, ఏప్రిల్ 13: ఒకప్పుడు కరపత్రాలు, మైకులు, ఇంటింటా ప్రచారం చేసే నాయకులు ప్రజల్లోకి వెళ్లేందుకు ఏ అవకాశాన్నీ వదలడంలేదు. ఇందులో భాగంగా కొత్త తరహాలో ప్రచారాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం మొబైల్ లేని ఇళ్లు లేదు. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో ఫోన్‌లకు సందేశాలు పంపుతూ ప్రచారం చేస్తున్నారు. సంక్షిప్త సమాచార సందేశాలతో ఫలానా పార్టీ అభ్యర్థిని అని, ఇది నా గుర్తు అని చెబుతూ తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇందులో చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలు ఉన్నారు. పండుగలు, ప్రత్యేకంగా నేతలు జయంతులు, ప్రత్యేక రోజులు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూనే ఎస్ఎంఎస్ ద్వారా ఓటును అడుగుతున్నారు. తాను ఎన్నికల బరిలో ఉన్నానని చెప్పుకుంటున్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేవీఆర్‌సీఎంఎస్ పేరిట ఎస్ఎంఎస్ చేస్తుండగా, ఆర్ఎస్‌జేఆర్‌డీవై పేరిట రంజిత్‌రెడ్డి ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నారు. వాయిస్ రికార్డు ద్వారా ఫోన్లుచేసి మరీ ఓటు అభ్యర్థిస్తుండటం గమనార్హం.

కాంగ్రెస్ పార్టీ లక్ష్మాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా గోపి



నియామక పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 13: లక్ష్మాపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కటికెల గోపిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గోపికి నియామకపత్రాన్ని మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలు అందజేశారు. అదేవిధంగా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బండెల యాదగిరిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కీసరి నర్సింహులు, వైద్యనాథ్ పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో ఇంటింటి ప్రచారం

మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎంపీ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, వైస్ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, వైద్యనాథ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

- కంట్రోల్ రూమ్, మానిటరింగ్ సెల్ ఏర్పాటు
- ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ
- ఇన్‌చార్జిలుగా ఏఈ, డీఈఈలు

తాండూరు, ఏప్రిల్ 13: ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న దృష్ట్యా తాగునీటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మున్సిపాలిటీ స్థాయిలో కంట్రోల్ రూమ్, మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీఅయ్యాయి. తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా ఈచర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం ఈ కంట్రోల్ రూమ్ ముఖ్య ఉద్దేశ్యం. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు సిబ్బందితో పాటు ఫోన్‌నంబర్‌ను అందుబాటులో ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పవర్ బోర్డులు, ఓపెన్ వెల్, పంపుసెట్లు, వాటర్ ట్యాంకర్లు పనిచేసేలా చూడాలని కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. సమ్మర్ యాక్షన్ కింద ఇప్పటికే మంజూరైన నిధులకు సంబంధించి కలెక్టర్ నుంచి పాలనాపరమైన అనుమతులు పొందాలని సూచించారు. ఏర్పాటు చేయబడిన సెల్‌కి ఏఈ, డీఈఈని ఇన్‌చార్జిలుగా నియమించాలన్నారు. ఫిర్యాదులను కమిషనర్‌లు రోజు వారీగా సమీక్షించి అట్టి ఫిర్యాదులను పరిష్కరించాలి.

మున్సిపాలిటీ	వార్డుల సంఖ్య	కంట్రోల్ రూమ్ నెంబర్
వికారాబాద్	34	9866627984
తాండూరు	36	9133195468
పరిగి	15	9491160630
కొడంగల్	12	8333856780

ఘాటెక్కిన మిర్చి ధర

ధారూరు, ఏప్రిల్ 13: ధారూరు సంతలో శనివారం పచ్చి మిర్చి ధర ఘాటెక్కింది. కిలో రూ. 100ల వరకు వ్యాపారులు అమ్మకాలు జరిపారు. పచ్చి మిర్చి ధర అమాంత పెరగడంతో వినియోగదారులు తక్కువ పరిమాణంలో మిర్చిని కొనుగోలు చేశారు. కాగా సంతలో టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.30 ఉన్న టమాటా ఈ వారం కిలో 10 నుంచి 15 వరకు అమ్మకాలు జరిగాయి.



ధారూరు సంతలో పచ్చి మిర్చి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కృష్ణ



నియామక పత్రాన్ని అందుకుంటున్న కృష్ణ

ధారూరు, ఏప్రిల్ 13: మండలంలోని స్టేషన్ ధారూరు గ్రామానికి చెందిన ఎస్.కృష్ణను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండుగౌడ్, రాజేందర్ గౌడ్, ఎం.రమేశ్, విజయభాస్కర్‌రెడ్డి, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని అవడం ఖాయం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు కాసుల ఈశ్వర్‌గౌడ్

శామీర్‌పేట, ఏప్రిల్ 13: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా గెలుపొందడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు కాసుల ఈశ్వర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు మన భారత దేశాన్ని మార్గదర్శకంగా తీర్చిదిద్దాలన్నారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. పదేళ్లుగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాలు సైతం భారత్ వైపు చూస్తున్నాయన్నారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడానికి 400కి పైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. దేశమంతా ప్రధానిగా నరేంద్ర మోడీయే ఉండాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. 17పార్లమెంట్‌లో మినీ ఇండియాగా పిలువబడే అతిపెద్దదైన మల్కాజ్‌గిరి నియోజవర్గంలో ఉన్న తెలంగాణ ఉద్యమకారుడు, మచ్చలేని నాయకుడు ఈటల రాజేందర్ అందరి ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుస్తారని జోస్యం చెప్పారు. ప్రతి ఒక్క బీజేపీ ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలుపునకు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 13: ఈ నెల 15న నారాయణపేట పట్టణంలో జరిగే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ముదిరాజ్ సోదరులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు వెంకటయ్య, నర్సిములునాయుడు కోరారు. సమావేశంలో ముదిరాజ్‌ల చిరకాల స్వప్నం బీసీ డీ నుంచి బీసీ ఏ మార్పుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. బొంరాస్‌పేట్ మండలంలోని ముదిరాజ్ సోదరులు, నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు కోరారు.

క్రైం కార్నర్

లాడ్జిలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చిన్న సాయప్ప(ఫైల్)

తాండూరు, ఏప్రిల్ 13: తాండూరు పట్టణంలోని లాడ్జిలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. కొడంగల్ మండలంలోని టేకులకోడ్ గ్రామానికి చెందిన శామప్ప(65) శుక్రవారం తాండూరులో ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని పట్టణంలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లి భోజనం చేశాడు. అనంతరం వారింట్లో పడుకోకుండా శాంతినగర్‌లోని అవేక లాడ్జిలో రాత్రి బసచేశాడు. కాగా, శనివారం ఉదయం గది తలుపులు తీయకపోవడంతో గమనించిన లాడ్జి సిబ్బంది తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే బాత్రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసున్నాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఏడాది కిందట కుమారుడు మృతిచెందాడు. అప్పటి నుంచి మానసిక వేదనతో ఉన్న శామప్ప ఉరేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు

తాండూరు, ఏప్రిల్ 13: యాలాల మండలం పగిడిపల్లి గ్రామ శివారులో ఎర్ర హన్మప్పను దారుణంగా హత్యచేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు తాండూరు రూరల్ సీఐ అశోక్ కుమార్ శనివారం వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పగిడిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర హన్మప్ప వ్యవసాయ పొలంలో మర్రిచెట్టు కింద ఖాళీస్థలం విషయంలో అదే గ్రామానికి చెందిన ఎర్ర సమప్ప, ఎర్ర రమేష్, గోటిగ రాజు, పుండికూర శేఖర్, ఎర్ర మొగులమ్మ, ఎర్ర బస్వరాజ్, మ్యాతరి రమేష్‌లు ఈనెల 8న మధ్యాహ్నం గొడవకు దిగారు. ఈ క్రమంలో హన్మప్ప తల, కళ్లు, చేతులు, పొట్ట, వీపు భాగాల్లో తీవ్రంగా గాయపరిచారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారని సీఐ వెల్లడించారు. ఈ మేరకు నిందితులను ఈనెల 12(శుక్రవారం) అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ తరలించినట్లు సీఐ వివరించారు.

అదుపుతప్పి కారు బోల్తా



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దోమ, ఏప్రిల్ 13: అదుపుతప్పి కారు బోల్తాపడిన ఘటనలో తృటితో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని గోడుగోనిపల్లి వాగుసమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సల్కర్‌పేటకు చెందిన ఇరిగేషన్ డీఈ వెంకట్ రాములు శనివారం చేవెళ్ల మండలంలో విధులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గోడుగోనిపల్లి వాగు సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలానికి ఏర్పాటు చేసిన కంచెను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో డీఈ వెంకట్‌రాములకు స్వల్ప గాయాలయ్యాయి.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్, అన్నోజిగూడ లక్ష్మీనర్సింహా కాలనీకి చెందిన నానావత్ వినోద అలియాస్ లక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమె ఇంటిపై దాడిచేశారు. ఆమె వద్ద నుంచి మొత్తం 88మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వినోదను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మరో వ్యక్తి

● ఖాతాలో రూ.96,543 మాయం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13: సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నమ్మించి మాట్లాడి అమాయకుల ఖాతాలను కొల్లగొడుతున్నారు. తాజాగా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మరోవ్యక్తి చిక్కాడు. బ్యాంక్‌కు సంబంధించి ప్రోమోకోడ్ నెంబర్ చెప్పడంతో రూ.96,543లు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం, ఎదులాబాద్‌కు చెందిన వెల్లంకి రాజనర్సింహాకు సౌత్‌ఇండియా బ్యాంక్ కస్టమర్ కేర్ కోసం గూగుల్‌లో వెతికాడు. కొద్దిసేపటికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌కాల్ వచ్చింది. సౌత్ ఇండియా బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకుని మీఫోన్‌కు బ్యాంక్‌కు సంబంధించిన ప్రోమోకోడ్ వచ్చిందని చెప్పాడు. వెంటనే ప్రోమోకోడ్‌కు సంబంధించిన లింక్‌ను క్లిక్ చేయమని చెప్పాడు. అతడు చెప్పినట్లు చేసిన రాజనర్సింహా ఫోన్‌పే నుంచి రూ.96,543లు డెబిట్ అయ్యాయి. దీంతో ఆందోళనకు గురైన రాజనర్సింహా బ్యాంక్‌కు వెళ్లి సంప్రదించగా సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మోసపోయినట్లు తెలిపారు. పోలీసులకు జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 13: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల కంఠమహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ పూజల్లో శనివారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల ఆరాధ్యదైవం అయిన కంఠమహేశ్వర స్వామి దేవాలయం నిర్మించి నిత్య పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐక్యంగా ఉంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుర్వీ రవీందర్, నాయకులు నల్లవెల్లి శేఖర్, వెంకటస్వామి, దానయ్య, దర్శన్, భాస్కర్, శ్రీనివాస్, శంకర్, నర్సింహ, యాదగిరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.